సాక్షి జగిత్యాల

7



కోడెలకోసం రావొద్దు

ఉచిత పంపిణీ నిలిపివేశాం

తిరిగి ప్రకటించాకే రావాలి

- వివరాలు 8లో

గురువారం : 11 : జూలై : 2024

న్యూస్‌రీల్

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న అడిషనల్ కలెక్టర్, అధికారులు

మెట్‌పల్లిరూరల్: నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అడిషనల్ కలెక్టర్ రఘువరన్ అన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల, మేడిపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించారు. పల్లెప్రకృతి వనాలు, నర్సరీలను పరిశీలించారు. చెర్లకొండాపూర్ శివారు బండలింగాపూర్‌కు చెందిన భూముల్లో ఈత మొక్కలు నాటారు. ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై టీచర్లను అడగగా.. 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మరికొన్ని పనులు కావాల్సి ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

యూరియా కోసం బారులు



యూరియా కోసం సింగిల్ విండో కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

ఇబ్రహీంపట్నం: యూరియా కోసం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు బుధవారం బారులు తీరారు. మొక్కజొన్న పంటకు యూరియా అవసరం కావడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం సొసైటీకి 450, వర్షకొండ సొసైటీకి 450 చొప్పున యూరియా బస్తాలు వచ్చాయి. దీంతో రైతులు తమకు అందుతాయో..? లేదో..? అని కార్యాలయాలకు చేరుకున్నారు. ఒక్కో రైతుకు ఐదు బస్తాల చొప్పున అందించినట్లు అధికారులు తెలిపారు. ఫర్టిలైజర్ షాపుల్లో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అందుకే సొసైటీకి వస్తున్నామని రైతులు అంటున్నారు.

స్పౌజ్ పాయింట్లు పొందిన వారి వివరాలివ్వాలి

జగిత్యాల: స్పౌజ్ పాయింట్లు పొందిన ఉపాధ్యాయుల వివరాలు ఇవ్వాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి ఎంఈవోలను ఆదేశించినట్లు తెలిసింది. కొందరు స్పౌజ్ పాయింట్లు పొంది జీవిత భాగస్వామి పనిచేసే స్థలాన్ని కాకుండా వేరేచోట పోస్టింగ్ పొందారు. నిబంధనల ప్రకారం భార్య పనిచేస్తున్న చోటనే వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ పోస్టు లేకుంటే సమీపంలోనే పోస్టింగ్ పొందాలి. అలాంటి వారి వివరాలు ఇవ్వాలని, ఐదు రోజుల్లో నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారని తెలిసింది.

మోడల్ స్కూల్ సందర్శన

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాలలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను బుధవారం స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ అధికారి భరణి తనిఖీ చేశారు. పాఠశాలలో పరిశుభ్రత, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రిన్సిపాల్ లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతి లాభసాటి



చిట్టాపూర్‌లో వెదజల్లే పద్ధతిని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి వాణి

మల్లాపూర్: వరిని వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే తక్కువ ఖర్చుతో గట్టెక్కవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వాణి అన్నారు. బుధవారం మండలంలోని చిట్టాపూర్‌లో వెదజల్లే పద్ధతిని అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. సాధారణ పద్ధతిలో సాగు చేయడం ద్వారా పెట్టుబడి పెరగడంతోపాటు దిగుబడి తక్కువగా వస్తుందన్నారు. వెద పద్ధతి ద్వారా ఎకరాకు రూ.10వేల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. పది రోజుల ముందుగానే కోతకు వస్తుందని, ఎకరాకు మూడు క్వింటాళ్ల మేర దిగుబడి పెరుగుతుందని వివరించారు. మొక్కజొన్నకు కత్తెర పురుగు ఆశిస్తోందని, మొదటి దశలోనే గుర్తించి మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో లావణ్య, ఏఈవో శ్రీహరి, రైతులు కంది బుచ్చిరెడ్డి, బీమారం రవి, బద్దం రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాల్లో ప్రక్షాళన

- సిబ్బంది విభాగాల మార్పులు
- అవినీతి ఆరోపణల ఫలితం
- దిద్దుబాటు చర్యల్లో అధికారులు
- ఇప్పటికైనా పాలన గాడిన పడేనా..?



జగిత్యాల మున్సిపాలిటీ కార్యాలయం

జగిత్యాల: జిల్లాలోని బల్దియాల్లో ప్రక్షాళన ప్రారంభమైంది. ఈ మేరకు ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేస్తున్నారు. జగిత్యాల మున్సిపాలిటీ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు వస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాకేంద్రంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం.. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదని, అక్రమంగా వీఎల్టీలు ఇచ్చారంటూ అనేక ఆరోపణలు మున్సిపాలిటీల్లో వెల్లువెత్తాయి. ఈ విషయమై బాధితులు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ సత్యప్రసాద్ మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపాలిటీల్లో చాలారోజులుగా ఒకే విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగుల సెక్షన్లు మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉన్నతాధికారులు టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్, శానిటేషన్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది సెక్షన్లను మార్చుతున్నారు. జిల్లాలో జగిత్యాలతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి పెద్ద మున్సిపాలిటీలుగా ఉన్నాయి. రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలు కొత్తగా ఆవిర్భవించాయి. చిన్న మున్సిపాలిటీల్లో సమస్య పెద్దగా లేకున్నా.. పెద్ద మున్సిపాలిటీల్లో అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జగిత్యాల బల్దియాలోనైతే ప్రతి విభాగంలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాలు అధికంగా జరిగాయని నిత్యం ఫిర్యాదులు రావడంతోపాటు గతంలో టీపీవో ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరకడం చర్చనీయాంశమైంది. ఇందులో కీలకంగా వ్యవహరించిన ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి కూడా ఏసీబీకి పట్టుబడ్డాడు. శానిటేషన్ విభాగంలో డీజిల్ బిల్లుల్లో కుంభకోణం, పారిశుధ్య కార్మికుల కోసం కొనుగోలు చేసిన పరికరాల్లో గోల్‌మాల్ జరగడం, బీరువాల కొనుగోళ్లలోనూ ఇతే పరిస్థితి ఉండడం.. ఇలా అన్నిట్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. రెవెన్యూ సెక్షన్ విభాగంలోనైతే ఏకంగా ఓ భూమిని కబ్జాకు యత్నానికి పాల్పడగా రెవెన్యూ అధికారితోపాటు, కమిషనర్‌పై కేసు నమోదైంది. రెవెన్యూ అధికారి అరెస్ట్ కాగా.. కమిషనర్ సెలవుపై వెళ్లిపోయాడు. జగిత్యాలతోపాటు అన్ని మున్సిపాలిటీల్లో ఇదే సమస్య నెలకొనడంతో ఏళ్ల తరబడి పలు సెక్షన్లలో తిష్టవేసిన సిబ్బందిని మార్చాలని కలెక్టర్ ఆదేశించడంతో సిబ్బందిని బదిలీ చేస్తున్నారు.

మార్పు వచ్చేనా..?

ఏళ్ల తరబడి ఒకే సెక్షన్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతోపాటు రెగ్యులర్ ఉద్యోగులైన జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు సెక్షన్లపై పట్టు సాధించారు. వీరిని అడ్డుగా పెట్టుకుని అధికారులు అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. గతంలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి అన్ని తానై నడిపించేవాడు. ఆయనకు ప్రతి లొసుగు తెలియడంతో ఉన్నతాధికారులను లోబర్చుకుని అవినీతికి పాల్పడడంతో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇలా ప్రతి విభాగంలో అనేక మంది సిబ్బంది పాతుకుపోయారు. అయితే వీరిని ప్రస్తుతం ఇతర సెక్షన్లకు మారుస్తుండటంతో ఇప్పుడైనా మార్పు రావాలని ప్రజలు ఆశిస్తున్నారు.

బదిలీల గుబులు

ఇటీవల ప్రభుత్వం ప్రతి శాఖలోని అధికారులను బదిలీ చేస్తున్న నేపథ్యంలో మున్సిపాలిటిల్లో నాలుగు సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు బదిలీ తప్పడం లేదు. ఇప్పటికే చాలామంది ఉద్యోగులు బల్దియాలో నాలుగు సంవత్సరాలకు పైగా ప్రతి విభాగంలో పనిచేస్తున్నారు. దీంతో బల్దియాలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బదిలీ గుబులు పట్టుకుంది.

కమిషనర్‌గా రావడానికి జంకు

జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేయడానికి ఎవరూముందుకురాకపోవడంతో హైదరాబాద్ సెక్రటేరియేట్‌లో పనిచేస్తున్న సమ్మయ్యను డెప్యూటేషన్‌పై జగిత్యాలకు పంపించారు. జగిత్యాల మున్సిపాలిటీలోఅనేకఅవకతవకలుజరగడంతోపాటు, ఇటీవల భూకబ్జా యత్నం కేసులో ఏకంగా కమిషనర్‌పైనే కేసు నమోదు కావడంతో ఇక్కడ పని చేసేందుకు ఏ ఒక్క అధికారి ముందుకు రావడం లేదు.

యావర్‌రోడ్డు విస్తరణకు రూ.100కోట్లు కేటాయించండి





సీఎంకు వినతిపత్రం ఇస్తున్న జీవన్‌రెడ్డి, అడ్లూరి, మంత్రితో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని యావర్‌రోడ్డు విస్తరణకు రూ.100కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి వినతిపత్రం అందించారు. యావర్‌రోడ్డు విస్తరణతో ఇళ్లు, దుకాణాలు కోల్పోయే వారికి పరిహారం చెల్లించాల్సి ఉంటుందని, 100 ఫీట్లకు విస్తరించేందుకు సుమారు రూ.100కోట్లు అవసరం అవుతాయని పేర్కొన్నారు. అలాగే 2008, 2009లో నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నాలుగు వేల ఇళ్లు మంజూరు చేశారని, 1600 ఇళ్లు అర్ధంతరంగా నిలిచిపోయాయని, వాటికి నిధులు విడుదల చేయాలని కోరారు. దీనికి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం ఇద్దరూ కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గంలో పేరుకుపోయిన పెండింగ్ ప్రాజెక్ట్ పనులు, ఇరిగేషన్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

18 మంది ఎస్సైల బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లాలో 18 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీస్థానం
అశోక్	ఎస్పీ జగిత్యాల	రాయికల్
అజయ్	రాయికల్	ఏఆర్ జగిత్యాల
రామకృష్ణ	పెగడపల్లి	సీసీఎస్ జగిత్యాల
రవికిరణ్	నార్నూర్(ఆదిలాబాద్)	పెగడపల్లి
ఇమ్రాన్‌సాయిద్	గుడిహత్నూర్(ఆదిలాబాద్)	జగిత్యాలటౌన్-1
గౌతమ్‌పవర్	బీర్‌పూర్	వీఆర్ జగిత్యాల
కె.కుమారస్వామి	మల్యాల-2	బీర్‌పూర్
మహేశ్	గాదిగూడ(ఆదిలాబాద్)	జగిత్యాల టౌన్-2
మహ్మద్ షరీఫ్	భైంసాటౌన్-2	వీఆర్ జగిత్యాల
ఇంద్రకరణ్‌రెడ్డి	జగిత్యాలటౌన్-2	ధర్మపురి-2
సుధీర్‌రావు	వీఆర్ జగిత్యాల	మల్యాల-2
దత్తాత్రి	సీసీఎస్ జగిత్యాల	సారంగాపూర్
రాజు	వీఆర్ జగిత్యాల	మెట్‌పల్లి-2
నరేశ్‌కుమార్	జగిత్యాల టౌన్-1	మల్యాల-1
అబ్దుల్ రహీం	మల్యాల-1	డీఎస్పీ జగిత్యాల
గీత	వీఆర్ జగిత్యాల	డీసీఆర్బీ జగిత్యాల
తిరుపతి	సారంగాపూర్	వీఆర్ జగిత్యాల
మహ్మద్ అరిఫొద్దీన్	వీఆర్ జగిత్యాల	సీసీఆర్ జగిత్యాల

సాగు భూములకే 'భరోసా'

- వెంచర్లు, కళాశాలల భూములకు బంద్
- సాగులోలేని 14 వేల ఎకరాల భూమి గుర్తింపు
- కళాశాలలు, రియల్ వెంచర్లు, గుట్టలకు జీపీఎస్ మార్కింగ్
- వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అధికారులు
- సాగు, భూపరిమితులపై 19న ప్రజాప్రతినిధులతో భేటీ
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరుల అభిప్రాయ సేకరణ



సాక్షిప్రతినిధి,కరీంనగర్: రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతుబంధు గతంలో దుర్వినియోగానికి గురైంది. పలువురు తమ రియల్ వెంచర్లు, గుట్టలు, రోడ్లు, కళాశాలలకు కూడా ఎకరానికి రూ.ఐదువేల చొప్పున రైతుబంధు తీసుకున్నారు. తాజా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సాయాన్ని ఎకారానికి రూ.7500 చేసింది. అమలు చేసే ముందు క్షేత్రస్థాయిలో పారదర్శకత ఉండేలా సాగులో ఉన్న భూమికే ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జూలై 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా శాంపిల్ సర్వే కింద ఐదు జిల్లాల్లో ఓ సర్వే నిర్వహించింది. అందులో కరీంనగర్ కూడా ఉంది. దీనికి గతేడాది వర్షాకాలంలో సాగుచేసిన పంటలను ప్రామాణికంగా తీసుకుని తిరిగి ×ల్యాండ్ యుటిలైజేషన్ సర్వే ఫీల్డ్ వెరిఫికేషన్¤ పేరిట సర్వే చేశారు. ఈ సర్వే ఆధారంగానే రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించనుంది.

కరీంనగర్‌లో 14,100 ఎకరాలు

రాష్ట్రవ్యాప్తంగా సాగులో లేని దాదాపు 20లక్షల ఎకరాల వివరాలు సర్వే చేయగా, అందులో కరీంనగర్‌లో 3.40 లక్షల ఎకరాలకుపైగా సాగుభూమిలో దాదాపు 51,000 అనుమానాస్పద ఎకరాలను గుర్తించి సర్వే చేశారు. వీటిని ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేశారు. అందులో గుట్టలు, కొండలు, రోడ్లు, బంజరుభూమి, రియల్ వెంచర్లు, కళాశాలలు తదితర ఆప్షన్లు ఉన్నాయి. ఈ క్రమంలో కరీంనగర్‌లో దాదాపు 14,100 ఎకరాల భూమి సాగులో లేదని గుర్తించారు. అందులో అధికశాతం రియల్ ఎస్టేట్ వెంచర్లు, కళాశాలలు, కొండలు, బంజరు భూములు ఉన్నాయి. వీటిని ఆన్‌లైన్‌లో జీపీఎస్ ద్వారా మార్కింగ్ చేశారు. ఇక మీదట వీటిని వ్యవసాయాధికారులు చూసినప్పుడు అది సాగుభూమా? ఇతరత్రా అన్నది స్పష్టంగా తెలుస్తుంది. సాగుభూమి అయితే రైతు భరోసాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

19న ప్రజాప్రతినిధులతో భేటీ

రైతుభరోసా అమలు చేసేందుకు ఈనెల 19 మంత్రివర్గ ఉపసంఘం కరీంనగర్ జిల్లాలో పర్యటించనుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్, పీఏసీ చైర్మన్లు, వ్యవసాయ అనుబంధ సొసైటీ ప్రతినిధులతో మంత్రివర్గ ఉపసంఘం భేటీ అవుతుంది. వీరి నుంచి అభిప్రాయాలు సేకరిస్తుంది. పెట్టుబడి సాయం రూ.5000 నుంచి రూ.7500కు పెంచుతున్న క్రమంలో సాగు పరిమితి, భూ పరిమితిపై అభిప్రాయాలు సేకరించనున్నారు. సాగు భూమికి ఎన్ని ఎకరాలకు సీల్ విధించాలి? ఎంత భూమికి రైతు భరోసా చెల్లించాలి? అన్న విషయాలపై అభిప్రాయాలు తీసుకోనున్నారు. ఇందుకోసం కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు జిల్లా వ్యవసాయాధికారుల (డీఏవో)లు ఇప్పటికే ఆయా జిల్లాల వ్యవసాయ భూముల పరిస్థితిపై నివేదికలు సిద్ధం చేశారు. వీరికి కరీంనగర్ జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు.

అదేరోజు నివేదిక పంపిస్తాం



19న మంత్రివర్గ ఉపసంఘం ప్రజాప్రతినిధులతో సమావేశం అవుతారు. వీరితోపాటు వివిధ వర్గాల అభిప్రాయలు సేకరిస్తారు. సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, సొసైటీల చైర్మన్లు, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల వ్యవసాయాధికారులు కూడా హాజరవుతారు. అదే రోజు సాయంత్రం సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపిస్తాం.

– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి



'ఈయన పేరు కర్ర తిరుపతిరెడ్డి. సైదాపూర్ మండలం స్వస్థలం కాగా, పదేళ్ల క్రితం కరీంనగర్‌లోని రేకుర్తిలో స్థిరపడ్డారు. వ్యవసాయాధారిత కుటుంబం. పట్టణంలో విపరీతమైన కాలుష్యం, కూరగాయలపై రసాయనాల ప్రభావాన్ని చూసి, తన ఇంటి మిద్దెపై ఐదేళ్లుగా కూరగాయలు, పూల మొక్కలు సాగు చేస్తున్నారు. బీర, సొరకాయ, కాకర, చిక్కుడు, టమాట, బెండ, క్యాబేజీ, కాలీఫ్లవర్, పల్లి, కొత్తిమీర, ఆకుకూరలు పండిస్తున్నారు. తన దీక్ష టెక్నో స్కూల్ సిబ్బందికి ఉచితంగా కూరగాయలు ఇస్తూ సదరు సాగును ప్రోత్సహిస్తున్నారు.'



'మామిడి కాయలు తెంపుతున్న ఈమె పేరు విజయలక్ష్మి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం. తన ఇంటి మిద్దెపై పండ్ల తోటలు సాగు చేస్తూ ఔరా అనిపిస్తోంది. మిద్దె తోటల నిపుణుడు రఘోత్తంరెడ్డి సూచనలతో మామిడి, బొప్పాయి, జామ, నిమ్మ వంటి రకాలను సాగు చేస్తుండగా సాధారణ పంటల మాదిరిగానే దిగుబడి వస్తోంది. మొత్తం సేంద్రియ పద్ధతిలోనే పండిస్తున్నానని చెబుతోంది విజయలక్ష్మి.'

మిద్దె తోట.. ఆరోగ్య బాట



మిద్దెపై కూరగాయలు, పూల సాగు

- సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్లు, పూల తోటల సాగు
- ఉమ్మడి జిల్లాలోని పట్టణవాసుల్లో పెరిగిన ఆసక్తి
- ఆరోగ్యంతోపాటు అదనపు ఆదాయం
- ప్రభుత్వం ప్రోత్సహిస్తే మేలు

రోజుకు కూరగాయల అవసరం..

ఉమ్మడి జిల్లా జనాభా:	37,76,269
గ్రామీణ ప్రాంత జనాభా:	28,25,044
పట్టణ జనాభా:	9,51,225
ఒక్కో వ్యక్తికి రోజుకు అవసరం:	300 గ్రాములు
మొత్తం కూరగాయల అవసరం	:11,32,880 కిలోలు
ప్రస్తుత ఉత్పత్తి : 5,46,768 లక్షల కిలోలు	
కావాల్సిన ఉత్పత్తి : 5,86,112 కిలోలు	

కరీంనగర్ అర్బన్: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. దీనికితోడు వాటిని పండించేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో కేన్సర్ బారినపడే అవకాశాలున్నాయి. ఎలాంటి పురుగు మందులు వాడని, తాజాగా ఉండే కూరగాయలు తినాలనుకునేవారు తమ ఇంటి మిద్దెపై సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్లు, పూల తోటలు సాగు చేస్తూ సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, మానకొండూరు, పెద్దపల్లి, సుల్తానాబాద్, రామగుండం, గోదావరిఖని, సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి వంటి ప్రాంతాల్లో మిద్దె తోటల సాగుపై ఆసక్తి పెరిగింది. తమ అవసరాలకు పోను మిగతా కూరగాయలు, పండ్లు విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు.

హైదరాబాద్‌లో ప్రోత్సాహకం..

ప్రస్తుతం హైదరాబాద్‌లో సేంద్రియ పద్ధతిలో మిద్దె తోటలను సాగు చేసే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తోంది. ఇంటిపైన కనీసం 720 చదరపు అడుగులకు గానూ ఒక పంటకు రూ.10 వేలు, రెండు పంటలకు రూ.20 వేలు, మూడు పంటల దిగుబడి వస్తే రూ.30 వేలు ఇస్తోంది. ఈ విధానాన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో అమలు చేస్తే మిద్దె తోటల సాగు విస్తృతం కానుంది.

గతంలో కూరగాయల కాలనీల ఏర్పాటుకు నిర్ణయం

కూరగాయల కాలనీలను ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించిన ప్రభుత్వం అంతలోనే విత్తన రాయితీకి స్వస్తి పలకడం విమర్శలకు తావిస్తోంది. ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉండగా ధరల మంట తప్పదేమో. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద వ్యవసాయాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించేది. వాటిని ఇన్నేళ్లు రాష్ట్ర ప్రభుత్వం విత్తనాల రాయితీకి వినియోగించేది. తాజాగా ఆర్‌కేవీవైపై నిధులు బిందు, తుంపర సేద్య పరికరాల పంపిణీకి మాత్రమే వెచ్చించాలని ఆదేశించడంతో నిధులను మళ్లించారు. దీంతో, గత ఐదేళ్లుగా కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గుతోంది.

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు

2019లో 11,431 హెక్టార్లు, 2020లో 9,867, 2021లో 8,958, 2022లో 8,015, 2023లో 7,832, 2024లో 7,500 హెక్టార్లలో సాగు చేశారు.

మార్కెటింగ్ సదుపాయం లేదు

ఉమ్మడి జిల్లాలో వందలాది మంది రైతులు సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిస్తున్నా మార్కెటింగ్ సదుపాయం లేక సాధారణ పంటల మాదిరిగానే అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సేంద్రియ సాగు చేసే రైతులను గుర్తించి, వారికి ప్రత్యేకంగా ధ్రువీకరణ ఇప్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో, ఆత్మ అధికారులు ఇటీవల వారితో సమావేశమై, మార్కెటింగ్‌పై ప్రణాళిక రూపొందించడం మొదలైంది. సేంద్రియ పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు వ్యవస్థీకృత విధానాన్ని తేవాలని కేంద్ర వ్యవసాయ శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేయడం వల్ల రైతులకు మేలు జరగనుంది. మన కూరగాయల పేరిట మార్కెటింగ్ శాఖ హైదరాబాద్‌లో ప్రత్యేకంగా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అదే మాదిరిగా జిల్లాల్లోని రైతు బజార్‌లలో ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎక్కడున్నా సాగు చేస్తాం



మాది వ్యవసాయ కుటుంబం. ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నాను. ఎక్కడున్నా తప్పకుండా కూరగాయలు సాగు చేస్తాం. టమాట, వంకాయ, కాకర, బెండ, కొత్తిమీర, మెంతి, పుదీన, ఆకుకూరలు పండిస్తున్నాం.

– నోముల మల్లికార్జున్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, సుల్తానాబాద్

విచ్చలవిడిగా రసాయనాలు..



మార్కెట్‌లో కూరగాయలను కొనాలంటేనే భయం. రసాయన మందులు, ఎరువులు విచ్చలవిడిగా వాడటం వల్ల కేన్సర్ బారినపడే ప్రమాదం ఉంది. అందుకే కూరగాయలు సాగు చేస్తున్న. మా ఇంటి మేడపై లేని కూరగాయ లేదు.

– ఎదులాపురం రాజేంద్రప్రసాద్, ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్, తిరుమల్‌నగర్, కరీంనగర్

సేంద్రియ సాగు పెంచాలి



ప్రభుత్వం ప్రజారోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రస్తుతం ప్రతీదాంట్లో కల్తీనే. చివరికి కూరగాయలు పండించేందు కూరసాయనాలు వాడటం వల్ల ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. ఆహార తనిఖీ వ్యవస్థను పటిష్టం చేసి, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. సేంద్రియ సాగును పెంచేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించాలి.

– వినోద, టీచర్, ఎన్టీఆర్ చౌరస్తా, కరీంనగర్

12న తెలంగాణ బోనాలు

జగిత్యాల: మేదిని లలిత కళాక్షేత్రం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ఈనెల 12న బోనాల పండగ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బొమ్మిడి నరేశ్‌కుమార్, భుజంగరావు తెలిపారు. ధర్మపురి రోడ్‌లో గల బీఎల్ఎన్ గార్డెన్స్‌లో 12న ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలు తెలిపేలా వేడుక ఉంటుందని పేర్కొన్నారు. శ్రీసీతారామ దేవాలయ కమిటీ అధ్యక్షుడు అశోక్‌రావు, చిరంజీవి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


లస్మయ్య (ఫైల్)

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన మోదుంపల్లి హన్మంతు (56) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. హన్మంతు బుధవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అతని తలకు బలమైన గాయమవడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య లస్మమ్మ, కుమారుడు గోపి ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

జ్వరంతో యువకుడి మృతి


శివతేజ(ఫైల్)

కథలాపూర్: మండలంలోని పోసానిపేటకు చెందిన దీకొండ శివతేజ(24) జ్వరంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. శివతేజ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఇదే సమయంలో రక్తకణాలు తగ్గడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: గ్రూప్–1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వారు వెబ్‌సైట్‌లో ఈనెల 19 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని, 75 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణ ఈనెల 22న ప్రారంభమవుతుందని తెలిపారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.5వేల ఉపకార వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 040–24071178 సంప్రదించాలని కోరారు.

డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

- ఏసీపీ ఉపేందర్
- 'అల్ఫోర్స్'లో అవగాహన కార్యక్రమం

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థులు, యువత డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఆర్ఎస్‌సీసీ ఏసీపీ ఉపేందర్ అన్నారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ప్రధాన క్యాంపస్‌లో బుధవారం డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు కలలుగన్న భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు యువత ముందుకుసాగాలని సూచించారు. మెడికల్, ఇంజినీర్ స్థాయి విద్యార్థుల వద్ద మత్తు, మాదక ద్రవ్యాలు దొరుకుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఫ్యాషన్ కోసం తీసుకుంటున్న డ్రగ్స్ వ్యసనంగా మారి, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలవారూ గంజాయికి బానిసలవుతుండటం బాధగా ఉందన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టిసారించి, ర్యాంకులు సాధించాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండం అభినందనీయమని పేర్కొన్నారు. త్రీ టౌన్ సీఐ జాన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.రాజేశం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోలీసులు, విద్యార్థులు

తిమ్మాపూర్: విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ బాబా, ఎస్సై భారతి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కళాశాలలు, స్కూళ్లలో మాదకద్రవ్యాల వినియోగం, దుష్పరిణామాల పై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అలుగునూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అవేర్నెస్ కల్పించారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం స్టూడెంట్స్‌తో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుళ్లు నరేశ్, సురేశ్, నవత, వంశీ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ఎక్సైజ్ సీఐ, ఎస్సై, విద్యార్థులు

పంచాయతీల్లో మీసేవ కేంద్రాలు


మోతెలో గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న సంపత్‌రావు

జగిత్యాలరూరల్: మహిళా సంఘాల సభ్యుల ద్వారా ఇందిర మహిళా మీ సేవ కేంద్రాలను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటుకు నిర్ణయించినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధి కారి సంపత్ రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం జగిత్యాల రూరల్‌మండలం ధర్మారం, అర్బన్ మండలం మోతె, హస్నాబాద్ గ్రామాల్లోని గ్రామపంచాయతీ భవనాలను పరి శీలించారు. రాష్ట్రప్రభుత్వం మహిళాశక్తి కార్యక్రమాలను అమలు చేస్తూ వారి ఆర్థిక ఎదుగుదలకు తో డ్పాటు అందిస్తోందన్నారు. జిల్లాలో 22మీ సేవ కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. జాబితాపూర్‌లో మహిళా సంఘం సభ్యురాలు నిర్వహిస్తున్న హోంఫుడ్ యూనిట్‌ను సందర్శించారు. ఆహార ఉత్పత్తులను పరిశీలించారు. ఎంపీడీవో రమాదేవి, ఏపీఎం గంగాధర్, ఏపీవో గంగలక్ష్మణ్, దయాకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి సీడీపీవో సరెండర్?

జగిత్యాల: మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో సీడీపీవోను కలెక్టర్ సరెండర్ చేసినట్లు తెలిసింది. ఈ మేరకు సీడీపీవోకు సరెండర్ ఉత్తర్వులు పంపించినట్లు సమాచారం. ప్రాజెక్ట్ పరిధిలో పౌష్టికాహారం పంపిణీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వరంగల్ ఆర్జేడీ మెట్‌పల్లికి వచ్చి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఆ మేరకు సీడీపీవోను కలెక్టర్ సరెండర్ చేసినట్లు సమాచారం.

రామడుగు ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

- ఆయనతో నాకు ప్రాణహాని ఉంది..
- వెలిచాలవాసి కుతాడి కనకయ్య

విద్యానగర్(కరీంనగర్): తనపై దొంగతనం మోపి, నేరాన్ని ఒప్పుకోవాలంటూ రామడుగు ఎస్సై మామిడాల సురేందర్ తీవ్రంగా హింసించారని బాధితుడు, వెలిచాలవాసి కుతాడి కనకయ్య ఆరోపించాడు. తనకు ప్రాణహాని ఉందని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరాడు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తప్పుడు ఫిర్యాదుపై ఎలాంటి విచారణ చేయలేదన్నాడు. గత నెల 11న వేకువజామున ఇంట్లో నిద్రిస్తున్న తనను రామడుగు పోలీసులు వచ్చి, ఠాణాకు తీసుకెళ్లి, విపరీతంగా కొట్టారని తెలిపాడు. అదేరోజు కరీంనగర్‌కు తరలించి, 12న మళ్లీ హింసించారని, రాత్రి 10 గంటలకు లేవలేని స్థితిలో తానుంటే ఇంటికి పంపించారని పేర్కొన్నాడు. దెబ్బలకు తీవ్ర జ్వరంతో బాధపడుతున్న తనను తిరిగి 25న స్టేషన్‌కు పిలిచి, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎస్సై, 8 మంది కానిస్టేబుళ్లు కాళ్లు కట్టేసి, నేలపై పడుకోబెట్టి, చేతులు, వీపు, పాదాలపై కర్రలు, బెల్టులతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏప్రిల్ నెలలో ఎవరో గొర్రెలు ఎత్తుకెళ్తే.. తాను చేసినట్లు ఒప్పుకోమని కొడుతూ.. ఒప్పుకోకపోతే చంపేస్తామని బెదిరించారని వాపోయాడు. తాను ఎలాంటి నేరం చేయలేదని, తన పిల్లలపై ప్రమాణం చేస్తున్నట్లు పేర్కొన్నాడు. తమ కుటుంబానికి ఎవరూ అండగా ఉండటం లేదని, రాజీపడాలని తమ గ్రామానికి చెందిన నాయకులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించాడు. ప్రభుత్వం స్పందించి, తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరాడు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేశ్, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.నాగరాణి, నాయకులు పుష్పలత, రాణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కనకయ్య, కుటుంబసభ్యులు

షోరూమ్‌లకు జరిమానా


జరిమానా విధిస్తున్న బల్దియా అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న రెండు వాహన షో రూమ్‌లకు బల్దియా అధికారులు జరిమానా విధించించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు హెల్త్ అసిస్టెంట్ కిరణ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లేని ఆదర్శ టీవీఎస్ షో రూమ్‌కు రూ.5,000, ఫ్రెండ్స్ రాయల్ ఈవీ బైక్ షో రూమ్‌కు రూ.2,000 జరిమానా విధించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే జరిమానాతోపాటు షాప్ సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

కోడెల కోసం రైతులు రావొద్దు

- ఉచిత పంపిణీ నిలిపివేశాం
- తిరిగి ప్రకటించాకే రావాలి

వేములవాడ: రాజన్న గోశాలలో కోడెల సంఖ్య పెరిగిపోవడంతో అర్హులైన రైతులకు ఇటీవల ఆలయ అధికారులు ఉచితంగా పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల రైతులు సైతం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకుని రాజన్న కోడెలను తీసుకెళ్లారు. దీంతో కోడెలు చాలా వరకు తగ్గిపోయాయి. ఉచిత కోడెల పంపిణీ ఇక నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు ఈవో కార్యాలయం ఎదుట బుధవారం ఓ ఫ్లెక్సీ కట్టేశారు. తిరిగి పంపిణీ చేసే ప్రక్రియను ప్రకటిస్తామని, అప్పటి వరకు ఈ ప్రక్రియ నిలిపివేస్తున్నట్లు ఈవో పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అప్పటి వరకు రైతులెవ్వరూ ఉచిత కోడెల కోసం కార్యాలయం చుట్టూ తిరగొద్దని కోరారు.


ఈవో కార్యాలయం ముందు ఫ్లెక్సీ కడుతున్న ఆలయ ఉద్యోగులు

చికిత్స పొందుతూ రైతు మృతి

- ప్రాణాలు బలితీసుకున్న భూ వివాదం
- ఇరుకుల్లలో పోలీసు బందోబస్తు

కరీంనగర్‌రూరల్: భూవివాదంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ రైతు చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున ఆస్పత్రిలో మృతిచెందాడు. ఆ రైతు మృతికి కారణమైన వ్యక్తి ఇంటివద్ద మృతుడికి అంత్యక్రియలు నిర్వహిస్తారనే సమాచారంతో పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కరీంనగర్ మండలం ఇరుకుల్లకు చెందిన బుర్ర లక్ష్మయ్య(60)కు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు కాగా భార్య ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందింది. ఇద్దరు కూతుర్లకు వివాహాలు కాగా కుమారుడు సాయిబాబు ఉపాధినిమిత్తం కువైట్ వెళ్లాడు. 2002 సంవత్సరంలో బుర్ర ఓదయ్య నుంచి సర్వేనంబరు 79/ఏలోని 4గుంటల స్థలాన్ని రూ.8వేలకు సాదా బైనామా ద్వారా లక్ష్మయ్య కొనుగోలు చేశాడు. 15రోజుల క్రితం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్మయ్య కోరగా ఓదయ్య నిరాకరించడంతో మంగళవారం కుల పంచాయితీ పెట్టారు. రూ. 2లక్షలు ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తానని ఓదయ్య చెప్పగా రూ.లక్ష ఇచ్చేందుకు లక్ష్మయ్య ముందుకురాగా ఓదయ్య ఒప్పుకోలేదు. మనస్తాపానికి గురైన లక్ష్మయ్య ఇంటికి వచ్చి గడ్డిమందు తాగడంతో స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం వేకువజాము న 4గంటలకు మృతిచెందాడు. భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా తన తండ్రి మృతికి కారణమైన ఓదయ్యపై చట్టరీత్యా చర్యలు తీసుకోవా లని కూతురు స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మయ్య మృతికికారకుడైన ఓదయ్య ఇంట్లో అంత్యక్రియలు నిర్వహిస్తారనే ముందస్తు సమాచారంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోస్టుమార్టం అనంతరం లక్ష్మయ్య మృతదేహాన్ని కుటుంబసభ్యులు ఇంటికి తీసుకొచ్చి అంత్యక్రియలను పూర్తి చేశారు.


బుర్ర లక్ష్మయ్య(ఫైల్)

ఆభరణాలు తస్కరించిన వ్యక్తికి జైలు

చిగురుమామిడి: కొండాపూర్ గ్రామానికి చెందిన దరిపెల్లి లచ్చవ్వ చెవులకు ఉన్న బంగారు ఆభరణాలను నమ్మించి తస్కరించిన పర్వతం రాజుకు కరీంనగర్ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ 8 నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు చిగురుమామిడి ఎస్సై బి.రాజేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. లచ్చవ్వ వద్దకు గత సంవత్సరం నవంబర్ 8న పల్సర్ బైక్‌పై పర్వతం రాజు అనే వ్యక్తి వచ్చాడు. గ్యాస్ సిలిండర్ మంజూరైందని, ఫొటో తీయాలని, చెవులకున్న ఆభరణాలను తీసి పక్కన పెట్టాలన్నాడు. లచ్చవ్వ ఆభరణాలను తీసి పక్కన పెట్టింది. నీకు వచ్చిన సిలిండర్‌ను ఇంట్లోకి తీసుకెళ్లమని రాజు నమ్మబలికాడు. ఆమె సిలిండర్‌ను ఇంట్లోకి తీసుకెళ్లిన మరుక్షణమే రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పర్వతం రాజును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారించిన ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి రాజుకు జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు.

మాతాశిశు కేంద్రంలో శిశువు అపహరణకు యత్నం

- మహిళ, మరోవ్యక్తిని పోలీసులకు అప్పగింత

కరీంనగర్‌టౌన్: మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ మహిళతో పాటు మరోవ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకెళితే... మద్యం మత్తులో ఉన్న ఓ మహిళ, మరో వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి మాతా శిశు కేంద్రం వద్దకు వచ్చి, అక్కడే ఉన్న ఓ తల్లి వద్ద ఉన్న బాబును మా బాబు అంటూ తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. భయాందోళనలకు గురైన ఆ తల్లి మాతాశిశు కేంద్రం లోపలికి పరుగు తీసింది. స్థానికులు అడ్డుకొని మద్యమత్తులో ఉన్న మహిళలను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆమెతో పాటు మరో వ్యక్తిని పట్టుకున్నారు. చిన్నపిల్లలను అపహరించేందుకు ఇద్దరు వ్యక్తులు వచ్చారంటూ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకొని ఇద్దరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి లేఖ

జగిత్యాలటౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు. ఉద్యోగులు విశ్రాంత జీవితంలో ఆర్థిక ఇబ్బంది పడకుండా పెన్షన్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాత పెన్షన్ స్థానంలో కంట్రీబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమల్లోకి తెచ్చారని, అప్పటి నుంచి ఉద్యోగులు పాత పెన్షన్ అమలు కోసం ఉద్యమాలు చేస్తున్నా.. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచా ర ని, వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు.

కాంట్రాక్టర్ల వేధింపులు భరించలేకపోతున్నం

- రామగుండం సీపీకి బాధితుడి ఫిర్యాదు

గోదావరిఖని: మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి కాంట్రాక్టర్ల వేధింపులు భరించలేకపోతున్నామని బాధిత కాంట్రాక్టర్ నూనేటి సతీశ్‌కుమార్‌యాదవ్ బుధవారం పేర్కొంటూ రామగుండం సీపీ శ్రీనివాస్‌కి ఫిర్యాదు చేశారు. గోదావరిఖనికి చెందిన తాను శ్రీరాంపూర్ ఏరియాలో మరో ఇద్దరు కాంట్రాక్టర్లు కుర్మ సతీశ్, కొలిపాక శ్రీనివాస్‌రెడ్డి భాగస్వామ్యంతో కొన్నేళ్లుగా కాంట్రాక్టు పనులు చేస్తున్నా మన్నారు. రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అసోసి యేషన్ ఆధ్వర్యంలోనే పని చేయాలని సూచించారని అన్నారు. అసోసియేషన్ తీరును వ్యతిరేకిస్తూ తాము లేఖ రాసినా.. నాయకుల నుంచి స్పందన రాలేదన్నారు. దీంతో సొంతంగా ఆన్‌లైన్ ద్వారా టెండర్లు పొంది ప నులు చేస్తున్నామని తెలిపారు. దీనిని దృష్టిలో పె ట్టుకుని కొందరు కాంట్రాక్టర్లు తమపై కక్షసాధిస్తున్నారని ఆరోపించారు. స్థానికేతరులు ఇక్కడ పనిచేస్తే బాగుండదని బెదిరిస్తున్నారని ఆవేదన చెందారు. ఈక్రమంలో తీవ్ర మానసిక వేదనకు గురైన తనతోటి కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం గుండెపోటుకు గురై మరణించాడని అన్నారు. బెదిరింపులతోపాటు వేధింపులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని తమను కాపాడాలని సీపీకి ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టర్ వెల్లడించారు.

గంగమ్మతల్లికి బోనాలు


బోనమెత్తుకున్న చైర్మెన్ అడువాల జ్యోతి

జగిత్యాలటౌన్: గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని పదోవార్డు మహిళలు ఇంటికో బోనంతో తల్లికి బోనాలు సమర్పించారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పాల్గొన్నారు. కౌన్సిలర్ సిరికొండ భారతి పాల్గొన్నారు.

ఏజెంట్ల సంక్షేమానికి ఏవోఐ కృషి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

జగిత్యాల: ఎల్ఐసీని కాపాడుకునేందుకు ఏజెంట్స్ ఆర్గజేషన్ ఆఫ్ ఇండియా కృషి చేస్తుందని రాష్ట్ర ఇన్‌చార్జి అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ సమావేశం జరిగింది. ఏవోఐ పోరాటాలతోనే ఏజెంట్లకు రూ.15 లక్షల వరకు బీమా సౌకర్యం సంస్థ కల్పించిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఒకే గొడుగు కింద ఉంటూ ఒకే పాన్‌కార్డ్‌తో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఖాతాలు, లావాదేవీలు కలిగి ఉంటున్నట్లు పేర్కొన్నారు. నాయకులు భద్రయ్య, శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.